# కోరిక

"అమ్మా! ఈరోజు నుంచీ నన్నెవరూ డిస్టర్బ్ చెయొద్దు!" దాదాపు హెచ్చరించింది సృజన.

లోపలి గదిలో నుండి ఈ మాటలు వింటున్న మేఘన అక్కడి నుండే అక్కకు వినిపించేలా బదులు పలికింది - "ఇతరుల సంగతి పక్కనబెట్టు. నువ్వు మమ్మల్ని డిస్టర్బ్ చేయకుండా ఉంటే అదే పదివేలు."

"ఏంఁటే టూమచ్‌గా మాట్లాడుతున్నావ్? నేను మిమ్మల్ని డిస్టర్బ్ చేస్తున్నానా? ఉప్పులగిబెడుతున్న రాచకార్యాలేంటి? నేన్నిన్ను డిస్టర్బ్ చేసిందెప్పుడు?" చెల్లి ధ్వనికి ప్రతిధ్వని వినిపించింది సృజన.

"హలో! మరీ అంతరెచ్చిపోబోకమ్మా!" తల దువ్వుకుంటూనే హాల్లోకొచ్చింది. "నిన్న మొన్నటిదాకా బావగారి గొప్పతనాన్ని గురించి ఊదరగొట్టింది నువ్వా? మేమా??"

మేఘన అంత సూటిగా అడిగేసరికి కంగారుపడిపోయింది సృజన.

"హు! ఆలూ లేదు చూలు లేదు కొడుకు పేరు సోమలింగం అన్నట్టు ఆయనగా[illegible] మీ ఆయన గాకముందే కోతల్తో ఊదరగొట్టేస్తున్నావ్. ఇక పెళ్లైతే నిన్ను పట్టతరమౌతుందా?" మరించి రెచ్చిపోయింది మేఘన.

"మేఘూ! నీకు దండం పెడతానే. కాస్త నీ దండకం ఆపు!" రెండు చేతులూ జోడించింది సృజన. "ఇన్నాళ్ళ సంగతి వదిలెయ్. పరీక్షలు ఇప్పుడు వారం రోజులు కూడా లేవు. ప్రస్తుతం ప్రశ్నా పత్రాలు... చాప్టర్స్ తప్ప, నాకేమీ గుర్తుకులేవు. గుర్తుకురావు..."



"కాబోయే మొగుడు కూడా...?" మధ్యలో అడ్డుకుంది మేఘన.

"షటప్!" ఏదో వినకూడని మాట విన్నట్టు బుసకొట్టింది సృజన.

"అబ్బా! మరి నేను పరీక్షలు రాసేటప్పుడు డిస్టర్బ్ చెయ్యొద్దే అంటే – 'బోడి ఇంటర్‌కే ఇంత బిల్డప్పా? అంటూ నన్ను చీప్ చేసి మాట్లాడలా?" కీలెరిగి వాతపెట్టింది' మేఘన.

"మేఘా! ఏంటే అల్లరి? అది చదువుకోవాల్సి ఉందని చెబుతుంటే అర్థం చేసుకోవెందుకే...." చిన్న కూతుర్ని మందలించింది సున్నితంగా భ్రమరాంబ.

మూతి మూడు వంకర్లు తిప్పింది మేఘన.

సంతోషంతో తల్లి ఇచ్చిన కాఫీ గబుక్కున తాగేసి, పుస్తకాలు సర్దుకొని బయట పడబోయింది.

"ఎందుకే అక్కడా, ఇక్కడా తిరిగి టైం వేస్ట్ చేసుకుంటావ్? ఇంట్లోనే నీ గదిలో కూర్చొని చదువుకో...." తల్లి మాట పూర్తి కాలేదు.

"ఇంట్లోనా... ? ఈ రాక్షసి ఉండగా.... " మేఘన వైపు చూసింది సృజన.

"హలో! అనవసరంగా తొందరపడకు. నిజంగానే ఇంటికంటే హాస్టల్ పదిలం. వెళ్ళు వెళ్ళు! హాస్టల్‌లో నీ ఫ్రెండ్స్‌కి చెప్పాల్సిన కబుర్లు చాలా మిగిలి ఉంటాయి. అవి పూర్తి చేసుకొనిరా! ఈలోగా బావగారొస్తే... బోర్ రాకుండా నేను స్వీట్ నథింగ్స్ చెబుతూ... ఉంటా...!"

సృజన గుండెల్లో రాయిపడ్డట్టైంది చివరి మాట వినగానే. ప్రద్యోతన్ వస్తానన్నది ఈరోజే !!! ఈ క్షణం దాకా తనకి జ్ఞాపకం లేదు. ఈ రాక్షసి కూడా ఇప్పటిదాకా గుర్తు చేయలేదు.... వెళ్తున్నదల్లా ఆగిపోయి, నీర్సంగా బెడ్ మీద కూర్చున్నది.

"ఏంటే? అబ్బాయొస్తానన్నాడా ఈరోజు? మరి నాకు చెప్పనే లేదు. కనీసం మీ నాన్నగారికైనా తెలుసా?" ఆశ్చర్యం, అయోమయం, కంగారు... భ్రమరాంబ గొంతులో.

"వారం కిందటే ఫోన్ చేశాడమ్మా! ఇదే చెప్పొద్దంది...." అక్క తప్పును ఎత్తి చూపింది మేఘన.

సృజన వైపు చూసింది భ్రమరాంబ.

"ఆయనే చెప్పొద్దన్నారమ్మా!" తలవంచుకుంది సృజన. "ఏదో పనిమీద హైదరాబాద్ వస్తున్నారట. వీలైతే ఇంటికొస్తారట...."

ఏమీ తోచలేదు భ్రమరాంబకు.

ఈ కాలంలో పెళ్ళి చూపులే పెళ్ళితంతును తలపించేవిగా ఉంటున్నాయి. నిశ్చితార్థంతోనే పిల్లలు ఆలూమగలైనట్టు భావిస్తున్నారు. ఎదిగిన వయసు, మారిన సామాజిక పరిస్థితులు, కమ్యూనికేషన్ వేగం ఈ పరిస్థితులను బలోపేతం చేస్తున్నాయి.

'మరో నాలుగైదు రోజుల్లో అమ్మాయికి పరీక్షలు. దాని మానసిక స్థితి ఎలా ఉంటుందో?' అనుకుంటూ "ఏం చేద్దామే?" అడిగింది భ్రమరాంబ.

అసలే వాళ్ళది తమకంటే చాలా పై చేయిగాగల కుటుంబం. కోట్లకు పడగలెత్తిన వాళ్ళు. అమ్మాయి అందం, అణకువ, చదువు, తమ కుటుంబానికున్న మంచి పేరు ఆధారంగా ఈ సంబంధం కుదిరింది. మర్యాదల్లోగాని, మరెక్కడైనా లోపం జరిగితే....? అసలు ఆ అబ్బాయి ఒక్కడే వస్తాడో, కూడా ఎవరినైనా తెస్తాడో... రకరకాల ఆలోచనలు భ్రమరాంబ మెదడును తొలిచేస్తున్నాయి.

బిక్కమొగమేసింది సృజన.

"ఇటువంటి క్లిష్ట పరిస్థితుల్లోనే మావంటి మేధావుల్ని సంప్రదించాలి మరి....." లేని కాలరెగరేసింది మేఘన.

ఇద్దరూ ఆమె వంక చూశారు.

గొంతు సవరించుకుంది మేఘన – "ప్రస్తుతం ఏ రకంగా చూసినా ఇంట్లో ఉండటం వల్ల నీ సమయమంతా వృధా అయిపోతుంది. అందుకే హాస్టల్‌కి వెళ్ళి ఫ్రెండ్స్‌తో కలిసి కంబైండ్ స్టడీలో పాల్గొనడమే తరుణోపాయం. అక్కడైతే నువ్వీ విషయాలు ఆలోచిద్దామన్నా గుర్తుకురావు. పైగా చదవటం కంటె, డిస్కషన్ ఎక్కువ ప్రయోజనకరం. బావగారొచ్చారనుకో, మీ ఫ్రెండ్ శోధనకి సెల్ ఉంది కదా! నేను ఇన్‌ఫాం చేస్తాను. ఏదో ఒక కారణం చెప్పి, మీ ఉడ్‌బిని నేను మానేజ్ చేస్తాను."

'ఎలా ఉంది మన ఐడియా?' అన్నట్టు ఓరకంట అక్కను చూసింది.

"మేఘా! వండర్‌ఫుల్. రియల్లీ యు ఆర్ గ్రేట్!" సంతోషంతో చెల్లిని ముద్దుపెట్టుకుంది సృజన.

"మనమెప్పుడూ గ్రేటేనమ్మా! కాకపోతే మీలాంటి మందమతులే మా ప్రతిభని గుర్తించడంలో ఎప్పుడూ లేటు..."

మేఘన డైలాగ్‌ని పట్టించుకునేంత సమయం కూడా లేని సృజన మరుక్షణం అదృశ్యమైంది అక్కడి నుండి.

భ్రమరాంబకి మాత్రం భయం తగ్గలేదు. వెంటనే బ్యాంకుకి ఫోన్ చేసి, భర్త రాజేశ్వర్‌ని ఉన్నపళంగా వచ్చేయమని చెప్పేసింది. కాబోయే అల్లుడుగారు ప్రద్యోతన్ ఇంటికి వస్తున్నాడని తెలుసుకున్న రాజేశ్వర్ వెంటనే లీవ్ అప్లై చేసి వచ్చేశాడు. భార్యకు తగ్గ భర్తలా బుద్ధిగా.

సికింద్రాబాద్‌లో ఉండే రాజేశ్వర్ ఓ ప్రముఖ బ్యాంకులో మేనేజర్. భార్య భ్రమరాంబ అనుకూలవతి. ఇద్దరు కూతుళ్ళు సృజన, మేఘన – వీళ్ళిద్దరికీ మధ్యన ఈశ్వర్ ఏకైక పుత్ర రత్నం విదేశాల్లో ఉన్నాడు. నెల్లాళ్ళ క్రితం సృజన నిశ్చితార్థం ప్రద్యోతన్‌తో అయింది. ప్రద్యోతన్ తండ్రి దేవరకొండలో పెద్ద బిజినెస్ మాగ్నెట్. అబ్బాయి కూడా అమ్మాయికి సరిజోడుగా ఉండటం, ఇద్దరి పరిచయాన్నీ సెల్‌ఫోన్లు మరింత ధృడం చేయడం..... ఇంతలో పరీక్షలు రావడం –

✠ ✠ ✠

సృజన పరిస్థితి పెనం మీది నుండి పొయ్యిలో పడ్డట్టయ్యింది. ఇంట్లో అయితే చెల్లి నోరు మూయించడం తేలిక. కాని, ఇక్కడ చెలుల నోటికి తాళం వేయడం అసాధ్యమనేది అర్థమయిపోయింది. అంత సీరియస్‌గా చదువుతూనే సందు దొరికినప్పుడల్లా బిందు, అవకాశం చిక్కినప్పుడల్లా అమృతవల్లి ప్రద్యోతన్‌ని గుర్తు చేస్తూ, స్టడీస్ మీద మనసు నిలువకుండా అడ్డుకుంటున్నారు. శోధన కూడా వాళ్ళను పూర్తిగా అడ్డుకోలేకపోయింది. సీరియస్‌గా ఓ మూలన కూర్చొని మనసుని చదువు మీద లగ్నంచేసే ప్రయత్నంలో పడింది సృజన.

" సృజా! ఫోన్!" దాదాపు అరచినట్లే అంది శోధన. సెల్‌ని గట్టిగా మూస్తూ.

"ఎవరు? మేఘనేనా?" ఇంత గొడవకీ అసలు అదే, ఆ కొండముచ్చే కారణం.... పళ్ళు నూరుకుంటూ అడిగింది సృజన - అత్తమీద కోపం దుత్తమీద చూపిస్తున్నట్టు.

"కాదు... మీ.... వారు...." నవ్వు బిగబట్టుకుంటూ - శోధన.

శోధన కూడా తననలా ఏడిపించడం నచ్చలేదు సృజనకి విసురుగా ఆమె చేతిలో నుండి సెల్ లాక్కుంది.

" ఏయ్ కోణంగీ! ఏంటి సమాచారం?" కోపాన్ని అణుచుకునే ప్రయత్నం చేస్తూ అంది.

" ...... " సమాధానం లేదు.

"నకరాల్ మానేసి, మాట్లాడు.... " కొంచెం కాఠిన్యం....

"... .... ..... " ఇంకా రెస్పాన్స్ లేదు.

" అసలు కాల్ రాకుండానే తననాటపట్టిస్తుందా శోధన?" అనుమానంతో మరో క్షణం గడిచింది. తిరిగి సెల్ శోధనకిచ్చేద్దామనుకుంటుండగా అవతలి కంఠం వినబడింది-

"సారీ...! నిన్ను బాగా డిస్టర్బ్ చేసినట్టున్నాను.... .. ొచ్చుకున్నాడు... ప్రద్యోతన్.

సృజన గొంతు మూగవోయింది. షాకింగ్‌గా ఉండిపోయింది. అతని కంఠం మళ్ళీ-

"హలో మేడమ్. మేం మీ అంత రంగుమీద లేనంత మాత్రాన మమ్మల్ని మరీ కోణంగుల్తో, కొండముచ్చుల్తో పోల్చడమేమీ బాలేదు..."

సృజన ప్రాణాలెగిరపోయినంత పనైంది..... " ప్రద్యూ... ప్రద్యూ.... అయామ్....

వెరీ... సారీ! వెరీ... వెరీ..... సారీ! అసలు మేఘన మాట్లాడ్తుందేమో అనుకొని...." కరిగి నీరైపోసాగింది.

అతను వెంటనే అర్థం చేసుకున్నాడు - "సరే! ఇలాంటి వాటన్నింటినీ వడ్డీతో సహా బదులు తీర్చుకుంటా గాని... నా కోసం ప్రస్తుతం ... ఒకటి... రెండు నిముషాలు టైం కేటాయించగలరా?"

సెల్ పట్టుకొని శోధనకి దూరంగా పరుగెత్తింది సృజన - " ప్లీజ్ ప్రద్యూ... ట్రైటు అండర్‌స్టాండ్ మై సిట్యుయేషన్.... ఇప్పుడెక్కడున్నారో చెప్పండి. ఇంటి వద్దేనా... ఇప్పుడే వస్తున్నా!" కళ్ళల్లో నీళ్ళు చిప్పిల్లాయి.

ఆ విషయం అతనూ ఊహిస్తున్నాడు.

"సృజా! డోంట్ వరీ... చెప్పేదంతా కూల్‌గా విను... ఓ.కే... ఉదయమే హైదరాబాద్ కి వచ్చాను. త్వరగా పని పూర్తిచేసుకొని, నిన్ను కలవాలనే తొందరలో యూనివర్సిటీ క్యాంపస్ నుండి వస్తూ అక్కడ మా ఫ్రెండ్‌ని కలిసేందుకు వెళ్ళాను. అక్కడ వాడు పరీక్షల కోసం శ్రమిస్తున్న తీరు - గొప్ప తపస్సులా అనిపించింది. నాతో ఒక్క నిముషం మాట్లాడితేనే ఎంతో కోల్పోయినట్ట ఫీలయ్యాడు. నా కళ్ళు చెమర్చాయి..."

ఊపిరి బిగబట్టి వింటూంది సృజన.

"నేను నిన్ను కలిసేందుకు వస్తున్నట్టు చెప్పి ఎంత పొరపాటు చేశానో నాకర్థమయింది. సృజా! నాదో కోరిక...."

"చెప్పండి...! " క్షణం తటపాయించి, గొంతు పెగల్చుకుంది ఆమె.

" మా సృజ మంచి మార్కులతో పాస్ కావాలి. అదే నేను కోరే ప్రస్తుత కోరిక. స్టడీస్ మీద మనసు పెట్టు. మంచి మార్కులు కొట్టు. అంత వరకూ నిన్ను కదిలిస్తే ఒట్టు!"

అతని మంచి మనసుకి ఆమె చలించింది. "ప్రద్యూ! థ్యాంక్యూ వెరీమచ్!" అంది ముద్దగా.

"ఉత్తి థాంక్సేనా? " ఒకింత నిరాశ అతని గొంతులో.

అతనికి కావల్సింది ఫోన్‌లోనే ఇచ్చేసింది సంతోషంగా సృజన.

❀❀❀

**(ఆంధ్రభూమి, ఆదివారం, 26 మార్చి 2006)**